సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం 8లో



అంతర రైల్వేస్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం 8లో



ప్రాణాలు తీసిన అతివేగం 8లో

'కూటమి' రచ్చరచ్చ



మేయర్ రాజీనామా చేయాలంటూ పోడియం ముందు బైఠాయించిన కూటమి కార్పొరేటర్లు

ప్రజా సమస్యల పట్టింపులేదు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి లేదు. నగరాభివృద్ధి ధ్యాసే లేదు. అర్జెంట్‌గా మేయర్ సీటును దక్కించుకోవడమే ప్రధాన అజెండాగా కూటమి కార్పొరేటర్లు సర్వసభ్య సమావేశంలో రెచ్చిపోయారు. స్థానిక సమస్యలపై చర్చించాలని జీరో అవర్ అడిగిన టీడీపీ కార్పొరేటర్లు..వాటిని ప్రస్తావించకుండా సభకు ముందొచ్చిన వారు తమ సీట్లలో కూర్చుండిపోయారు. స్కూల్‌లో చిన్నపిల్లల్లా వాదులాడుకున్నారు. అజెండాలో అంశాలను పక్కనపెట్టి.. సొంత అజెండాతో సమావేశానికి వచ్చి.. చర్చ జరగకుండా రచ్చ రచ్చ చేశారు. ఇలా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక్క అంశంపై కూడా చర్చించే అవకాశం లేకపోవడంతో సమావేశం బుధవారానికి వాయిదా పడింది. – విశాఖ సిటీ

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణానికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం తొలిసారిగా ఎన్నికైన ఎక్స్ అఫీషియో హోదాలో కౌన్సిల్ సమావేశానికి వచ్చిన శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబులను మేయర్ సన్మానించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

సమావేశం నేటికి వాయిదా

మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారానికి వాయిదా వేసినట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చెప్పారు.



సమావేశానికి హాజరైన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, రవీంద్రబాబు, వరుదు కల్యాణి

- అర్ధంతరంగా వాయిదా పడిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం
- అసలు అజెండాను పక్కనపెట్టి సొంత అజెండాతో వచ్చిన కూటమి కార్పొరేటర్లు
- జీరో అవర్ పేరుతో కాలయాపన
- మేయర్ రాజీనామా చెయ్యాలంటూ పోడియం ముందు బైఠాయింపు
- అజెండాలోని 75 అంశాలపై చర్చకు అవకాశమివ్వాలంటూ మేయర్ విజ్ఞప్తి
- ఆరోపణలపై విచారణ జరిపిస్తామని చెప్పినా పట్టించుకోని కూటమి సభ్యులు
- ఒక్క అంశంపైనా చర్చకు తావివ్వకుండా రాద్ధాంతం

'స్టీల్‌ప్లాంట్' పై తీర్మానానికి ససేమిరా..

సేవ్ స్టీల్‌ప్లాంట్ పేరుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్రకార్డులతో నినాదాలు చేశారు. దీనిపై సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు స్టాలిన్, గంగారావులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని సెయిల్‌లో విలీనం చేసే అంశంపై ముఖ్యమంత్రి ద్వారా కేంద్రం పెద్దలను కలిసే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆ అంశాన్ని టేబుల్ అజెండాలో చేర్చేలా రూలింగ్ ఇవ్వాలని కోరగా.. అందుకు మేయర్ అంగీకరించి అధికారులను ఆదేశిస్తున్న తరుణంలో టీడీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. స్టీల్‌ప్లాంట్‌పై తీర్మానం చేయడం ఇష్టం లేని టీడీపీ కార్పొరేటర్లు అందుకు ససేమిరా అన్నారు. మొత్తానికి స్టీల్‌ప్లాంట్‌పై తీర్మానం చేయకుండానే చర్చను పక్కదారి పట్టించారు.



సేవ్ స్టీల్‌ప్లాంట్ ప్లకార్డుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బర్కత్ అలీ

విద్యుత్ దీపాల నిర్వహణపై అసంతృప్తి

నగరంలో విద్యుద్ దీపాల విషయంలో మాత్రం కౌన్సిల్‌లో సభ్యులందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ నగరంలో లైటింగ్ అధ్వానంగా ఉందని, అనేక ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదని చెప్పారు. అనంతరం కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో 1.8 లక్షల లైట్లు ఉంటే.. 60 శాతం కూడా వెలగడం లేదన్నారు. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వెంటనే ఆ కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా విద్యుత్‌దీపాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మేయర్ హరివెంకట కుమారి జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. కాంట్రాక్ట్ రద్దు చేయడానికి న్యాయపరమైన చిక్కులు వస్తాయని, ముందుగా నోటీసులిచ్చి అప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని కమిషనర్ బదులిచ్చారు.



సభ్యులకు సమాధానం చెబుతున్న కమిషనర్

ఇష్టానుసార ఆరోపణలు

పారిశుధ్య కార్మికులకు సంబంధించిన టీడీఎస్ సొమ్మును అధికారులు కాజేశారని టీడీపీ కార్పొరేటర్లు ఆరోపించారు. కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బును అధికారులు సొంతానికి వాడుకున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు చెప్పినా సాకులు చెబుతున్నారని చెప్పారు. దీనిపై మేయర్ స్పందిస్తూ.. వెంటనే విచారణ చేయాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే కొన్ని సంఘాల నుంచి అధికారులు భారీగా కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. పొదుపు సంఘాలు, మహిళా మార్టులు.. ఇలా పలు సంఘాల ద్వారా మొత్తంగా రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందని చెప్పారు. ఇందులో అప్పటి కమిషనర్, మేయర్ హస్తం కూడా ఉందని ఆరోపించారు. దీనిపై మేయర్ విచారణ చేయాలని కమిషనర్‌ను ఆదేశించగా.. టీడీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. ఆరోపణలు ఉన్న మేయర్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనేక ఆరోపణలు ఉన్నాయని, ఆయన రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించడంతో.. టీడీపీ కార్పొరేటర్లు నీళ్లు నమిలారు. ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేక.. మేయర్ రాజీనామా చేయాలని ఆమె పోడియం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అభియోగాలు మోపి రాజీనామా చేయమనడం సమంజసం కాదని మేయర్ పేర్కొన్నారు. అయినప్పటికీ కూటమి కార్పొరేటర్లు పోడియం ముందు బైఠాయించారు. దీంతో మేయర్ 10 నిమిషాల పాటు సభను వాయిదా వేశారు. మళ్లీ మధ్యాహ్నం 1.30కి సభను ప్రారంభించగా.. మళ్లీ కూటమి కార్పొరేటర్లు సభ జరగడానికి అంగీకరించలేదు. దీంతో మేయర్ గంట పాటు లంచ్ బ్రేక్ ఇచ్చారు. మధ్యాహ్నం 2.30కి సభకు వచ్చినప్పటికీ.. వారి పరిస్థితిలో మార్పు లేదు. దీనిపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నన్ను రాజీనామా చేయమని చెప్పే హక్కు ఎవరికీ లేదన్నారు. టీడీపీ కార్పొరేటర్లందరిపై ఆరోపణలు ఉన్నాయని, అందరూ రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ మేయర్, అప్పటి కమిషనర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారించే అధికారం కలెక్టర్‌కు ఉందని, ఆయనకు లేఖ రాస్తామని చెప్పినప్పటికీ.. కూటమి కార్పొరేటర్లు నినాదాలను ఆపలేదు. దీంతో సభ జరిగే పరిస్థితి లేకపోవడంతో మేయర్ కౌన్సిల్‌ను బుధవారం ఉదయానికి వాయిదా వేశారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఎక్స్‌అఫీషియో సభ్యులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జీరో అవర్ కోసం పట్టు

సుమారు గంట పాటు వాగ్వాదాల అనంతరం సభను ప్రారంభించారు. ముందుగా అజెండాలో అంశాలపై చర్చించాలని మేయర్ చెప్పినప్పటికీ.. సభ్యులు స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని, జీరో అవర్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి మేయర్ అంగీకరించారు. అయితే ఒక్క లైటింగ్ విషయంపై తప్పా.. మరో స్థానిక సమస్యను సభ్యులు ప్రస్తావించలేదు.

ఫుడ్ కోర్టులో అసలైన లబ్ధిదారులను గుర్తించాలి

డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ మాట్లాడుతూ నైట్ ఫుడ్‌కోర్ట్‌లో 101 దుకాణాలకు అనుమతులిస్తే.. ప్రస్తుతం 179 వరకు ఉన్నాయన్నారు. ఇదే విషయంపై ఇతర సభ్యులు కూడా ప్రస్తావించడంతో మేయర్ స్పందిస్తూ.. వెంటనే అందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాలని ఆదేశించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి మాత్రమే అనుమతులు ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు.

నోరుపారేసుకున్న జనసేన కార్పొరేటర్

అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌పై దాడి చేసిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 100 రోజుల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి రెచ్చిపోయారు. బయటకు వెళ్లి ధర్నా చేసే ధైర్యం లేక సభలో చేస్తున్నారా? పిరికినా కొడకల్లారా.. అంటూ నోరు పారేసుకున్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ కార్పొరేటర్ల వద్ద ఉన్న మైక్‌ను లాక్కోడానికి తెగ ప్రయత్నించారు. ఒకవైపు టీడీపీ కార్పొరేటర్లు సైతం వారిని వారించడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె ఆగలేదు. మైక్ లాక్కొని వెళ్లిపోయారు.



దళితులపై దాడులు చేస్తున్న కూటమి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదం చేస్తున్న జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

న్యూస్‌రీల్

భారతీయ సంగీతం విశిష్టమైనది



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: భారతీయ శాస్త్రీయ సంగీతం, కళలు ఎంతో విశిష్టమైనవని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. మంగళవారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏయూ సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు 'భారతీయ శాస్త్రీయ, సంగీతం నృత్య శోభ'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సంగీతంలో భారతీయ సంగీతం, నృత్యం ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఏయూ జాతీయ స్థాయిలో నాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాలను పదిలం చేసుకుందన్నారు. రానున్న కాలంలో వీటిని మరింత మెరుగుపర్చుకుంటూ దేశంలోని తొలి పది విశ్వవిద్యాలయాల్లో ఏయూ నిలవడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

నెక్ట్స్ జనరేషన్ నెట్‌వర్క్‌పై సదస్సు



సదస్సుకు హాజరైన నేవీ అధికారులు

సింధియా: నగరంలోని కామ్‌నెట్‌సెన్‌లో నెక్ట్స్ జనరేషన్ నెట్‌వర్క్, డిజిటల్ క్రిప్టోగ్రఫీపై మంగళవారం అత్యాధునిక సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును తూర్పు నావికాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ముఖ్య అతిథిగా ప్రారంభించారు. వివిధ నావికాదళ సంస్థల నుంచి కమాండర్లు, నిపుణులైన వక్తలు సెమినార్‌కు హాజరయ్యారు. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎన్‌క్రిప్షన్ పద్ధతులు, సురక్షిత కమ్యూనికేషన్, క్వాంటం క్రిప్టోగ్రఫీ, 6జీ కమ్యూనికేషన్ తదితర అంశాలపై చర్చ జరిగింది.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో పాఠశాల, జూనియర్ కాలేజీల క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దేముడు బాబు తెలిపారు. గురువారం అండర్ -14, అండర్ -17 బాలబాలికల అథ్లెటిక్స్ ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో, రెజ్లింగ్ పోటీలు అల్లూరి సీతారామరాజు కొయ్యూరు జీటీడబ్ల్యూఏఎస్ (బాలురు) పాఠశాలలో జరుగుతాయన్నారు. 27న ఆనందపురం కేకేఆర్ గౌతమ్ స్కూల్ క్రీడా మైదానంలో అండర్ -17 బాలబాలికల మోడరన్ పెంటాథిలిన్ పోటీలు ఉంటాయన్నారు. 28న అండర్ -14, అండర్-17 స్విమ్మింగ్ పోటీలు రైల్వే స్టేడియం ఆర్ఆర్ ఆక్వాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న అండర్ -17 నెట్‌బాల్ జెడ్పీహెచ్‌ఎస్ కణితిలో నిర్వహిస్తామన్నారు.

కోర్టు ఉద్యోగాల ఇంటర్వ్యూలు వాయిదా

మహారాణిపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆఫీసు అసిస్టెంట్ (03), రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (1), ఆఫీసు సబార్డినేట్ (3) ఉద్యోగాల నియామకాలకు ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ తెలిపారు. ఇంటర్వ్యూలను ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ నిమిత్తం ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు విశాఖ జిల్లా కోర్టుల సముదాయంలోని న్యాయ సేవా సదన్‌కు చేరుకోవాలని సూచించారు.

27న అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి

మద్దిలపాలెం: దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి 1924-2024 వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నిర్ణయించిందని కార్యదర్శి ఎస్.ప్రకాశరావు తెలిపారు. వేడుకలను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం హాలులో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలి తెలుగు నవలను సినిమాగా తీసి, ఈ చిత్రానికి తొలి నంది అవార్డ్ పొంది అఖండ విజయం సాధించిన డాక్టర్ చక్రవర్తి చిత్రం విడుదల అయి 60ఏళ్ల పూర్తి చేసుకుంది. ఈ చిత్రాన్ని ఆరోజు ప్రదర్శించనున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సీనియర్ నటులు ఎస్‌కే మిస్రో, ఆంధ్ర బ్యాంకు పూర్వ చీఫ్ మేనేజర్ సుజాత, అక్కినేని నాట కోత్సవాల కమిటీ కార్యదర్శి డి.భూపతి రావు తదితరులు పాల్గొనున్నారన్నారు.

ఆ ఎమ్మెల్యేలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

- ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలను అరెస్ట్ చేయాలి
- ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దారుణం
- దళిత సంఘాల నిరసన

అల్లిపురం: అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును, డాక్టర్ ఉమా మహేశ్వరరావుని కులంపేరిట దూషించి, దాడి చేసిన జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమో దు చేసి వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ(ఏఎంఎస్), దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్), భీమ్‌సేన, కేవీపీఎస్, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎల్ఐసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు వైఖరి ప్రజల మధ్య కుల, మత ఘర్షణలు సృష్టించేలా ఉందని ఆరోపించారు. అదేవిధంగా ఏటూరిపాడులో గుడికి వెళ్లే దారిలో అంబేడ్కర్ ఫ్లెక్సీ ఉందని, దాన్ని స్వయంగా ఎమ్మెల్యే తన చేతులతోనే చించివేయడమే కాకుండా మసీద్ దగ్గర్లో, చర్చి దగ్గర్లో పెడితే ఊరుకుంటారా అని ప్రశ్నించడం, మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ఓ ప్రజా ప్రతినిధి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజ్యాంగ నిర్మాత ఫొటోను చించడమే కాకుండా ప్రజల మధ్య చిచ్చు పెట్టడం దారుణమన్నారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రంగరాయ మెడికల్ కాలేజీ వైస్ చైర్మన్, దళితుడైన డాక్టరు ఉమామహేశ్వరరావుని నోటికి వచ్చినట్లు దూషించి దాడి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ తీరు దురహంకారానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఎమ్మెల్యే నానాజీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్పందించకపోవడం దారుణమన్నారు. దళిత మహిళ అయిన హోమ్ మంత్రి అనిత వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కళ్యాణరావు, జేవీ ప్రభాకర్, పి.గౌతమ్, సత్యనారాయణ, వివిధ దళిత సంఘాల నేతలు పాకా సత్యనారాయణ, కస్తూరి వెంకటరావు, ఎస్.సుధాకర్, కె.చిన్నారావు, ఎస్సార్ వేమన ఈశ్వరరావు, మాటూరి శ్రీనివాసరావు, డాక్టర్ కె.గణపతి, తాడి కాంతారావు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు అద్భుతం

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తూ.. అధికారులను అప్రమత్తం చేయడంలో విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు అద్భుతమని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఏయూలో మంగళవారం జరిగిన విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం స్వర్ణోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఐఎండీ మన దేశానికి ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. సాంకేతిక సహాయాన్ని మరింత పెంపొందించుకోవటం ద్వారా భవిష్యత్తులో సంభవించే ప్రమాదాలను నివారించాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ కాలంలో సంభవించే ప్రమాదాలను నివారించలేమని, భవిష్యత్తు కాలంలో జరగబోయే నష్టాలను నివారించగలమని స్పష్టం చేశారు. విశాఖ పరిధిలో కూడా సుమారు 14 వేల ఇళ్లు కొండవాలు ప్రాంతాల్లో ఉన్నాయని వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉందని అన్నారు. పీపీపీ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపుదల, ప్రజల భాగస్వామ్యం, యంత్రాంగాల అప్రమత్తత ప్రమాదాల నివారణలో చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఏయూ వీసీ ప్రొ.శశిభూషణరావు, సీడబ్ల్యూసీ విశాఖ హెడ్ భారతి ఎస్ సబడే, ఇతర వాతావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సినీవినీలాకాశంలో సూర్యచంద్రులు ఘంటసాల, బాలు

- కళాభారతిలో ఘనంగా బాలు వర్ధంతి
- సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు బాలు సంగీత పురస్కారం





మాధవపెద్ది సురేష్‌కు బాలు సంగీత పురస్కారం అందజేస్తున్న అతిథులు, పాట పాడుతున్న సీపీ సతీమణి

మద్దిలపాలెం: సినీ వినీలాకాశంలో ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సూర్య, చంద్రులాంటి వారని ప్రముఖ సంగీత దర్శకుడు మాధవ పెద్ది సురేష్ అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతిని మంగళవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో యాక్మీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కి ఈఏడాదికి గాను డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ తన సంగీత దర్శకత్వంలో అత్యధిక పాటలు బాలు పాడినవేనన్నారు. తాను విశాఖ వేదికగానే తొలి అవార్డు స్వీకరించానని గుర్తు చేసుకున్నారు. బాలు పురస్కారాన్ని ఇదే విశాఖలో తీసుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. తాను త్వరలో అనకాపల్లి నూకాంబికా అమ్మవారికి ఆరు భక్తిగీతాలను స్వరపరచనున్నారన్నారు. అలాగే ఉత్తరాంధ్రలో కొలువైవున్న పుణ్యక్షేత్రాలకు సంబంధించి ఒక్కొక్క పాటను స్వరపరచడానికి సన్నాహాలు చేస్తున్నానన్నారు.

గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం గీతాలను చెన్నైకి చెందిన ప్రముఖ గాయకుడు రాము, నాదప్రియ, హజ్రత్‌లు ఆలపించారు. నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి సతీమణి బెంగాళీ గీతాన్ని ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చితోపాటు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావులు హాజరయ్యారు. యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో ఎస్పీ బిజమ్ పేరిట నిర్వహించారు. మిలీనియం శేఖర్ బృందం సంగీత సహకారం అందించారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్



సంఘటన స్థలంలో ప్రవీణ్, ప్రశాంత్ మృతదేహాలు



గాయపడ్డ మహేష్

మర్రిపాలెం/సీతమ్మధార: అతివేగం ఇద్దరు యువకులను బలితీసుకుంది. వారి కలలను చిదిమేసింది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ఇలా అకాల మరణం చెందడం చుట్టుపక్కల వారిని కలచివేసింది. కాగా.. డివైడర్‌ను ఢీకొన్న స్పోర్ట్స్ బైక్ సుమారు 200 మీటర్ల దూరం వరకు దూసుకుపోయింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉదయం 6గంటల ప్రాంతంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై అతి వేగంగా వెళ్తున్నారు. సంజీవ్‌నగర్ జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న ప్రవీణ్(20), మధ్యలో కూర్చున్న ప్రశాంత్(20) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చున్న మహేష్ తీవ్రగాయాల పాలయ్యాడు. అతడిని స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. సీతంపేటకు చెందిన ప్రవీణ్ బెహరా పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమో పూర్తి చేశాడు. అతని తండ్రి అచ్చిబాబు మాజీ సైనికుడు. తల్లి మహిళా మిత్రలో పని చేస్తున్నారు. వీరికి ప్రవీణ్ ఒక్కడే కుమారుడు. దొండపర్తికి చెందిన ప్రశాంత్ ఇంటర్మీడియట్ వరకు చదివి ఆపేశాడు. అతని తండ్రి బుజ్జి పెయింటర్. కప్పరాడకు చెందిన మహేష్ వెల్ఫేర్ పాలిటెక్నిక్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రవీణ్ తన తల్లిదండ్రులను రైల్వేస్టేషన్‌లో దించేందుకు సీతంపేటలో ఆటో ఎక్కించాడు. దొండపర్తిలో తన స్నేహితుడైన ప్రశాంత్‌ని బైక్‌పై ఎక్కించుకుని రైల్వేస్టేషన్‌కి వెళ్లి తల్లిదండ్రులను రైలు ఎక్కించాడు. నగరంలో బైక్‌పై తిరుగుదామని వీరిద్దరూ కలిసి కప్పరాడలో మహేష్‌ను ఎక్కించుకుని కంచరపాలెం వైపు వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం. కాగా.. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి సుమారు 200 మీటర్ల వరకు ద్విచక్ర వాహనం దూసుకుపోయింది. ఘటనా స్థలానికి కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడ్డ మహేష్ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత లేకుండా దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు నిర్వహించి.. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, తల్లులు తీసుకునేలా తగిన జాగ్రత్తలు చెప్పాలన్నారు. బాలల సంరక్షణ, విద్యపై కూడా దృష్టి సారించాలని, మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తల్లి పేరు మీద మొక్క నాటాలని, అటవీ, ఉద్యానవన శాఖల ద్వారా అవసరమైన మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. జిల్లాలో 3 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలో కలెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు గొండు సీతారామ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జి.జయలక్ష్మి, సీడబ్ల్యూసీ మెంబర్ రజని, మెడికల్ ఆఫీసర్ శ్రావణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అన్ని అంశాలకు ప్రాధాన్యమిస్తూ విజన్ ప్రణాళిక

మహారాణిపేట: సమ్మిళిత ఆర్థిక విధానాలు, అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యమిస్తూ విజన్ ప్రణాళికలు రూపొందించాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా జిల్లాలోని ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజన్ ప్రణాళికలు రూపొందించడంలో అనుసరించాల్సిన పద్ధతులు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. శాఖల వారీగా జాబితాలను సిద్ధం చేసే క్రమంలో జిల్లా స్థాయి అధికారుల సహాయాన్ని తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

తిరుమలను ప్రచారానికి వాడుకోవద్దు : కాంగ్రెస్

మహారాణిపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంశంపై ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు చూపించలేదని, హడావుడి తప్ప.. విచారణ వేగవంతం చేయడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్ ఓ ప్రకటనలో ఆక్షేపించారు. కూటమి నేతలు ప్రచారం చేసుకోవాలంటే చాలా అంశాలున్నాయని, భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని హితవు పలికారు.

పలు ఆలయాల ఈవోల బదిలీ

మహారాణిపేట: దేవదాయ శాఖలో పలువురు ఈవోలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం టర్నర్ చౌల్ట్రీ ఈవో టి.రాజగోపాల్ రెడ్డిని సంగివలస శ్రీ పోలమాంబ ఆలయం ఈవోగా, సంగివలస శ్రీ పోలమాంబ ఆలయం ఈవో బండారు ప్రసాద్‌ను మురళీనగర్ శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ గ్రూప్ ఈవోగా నియమించారు. అనకాపల్లి జిల్లా చోడవరం గ్రూప్ ఆలయాల ఈవో ఎస్.వి.వి.సత్యనారాయణమూర్తిని కశింకోట ఆలయాల గ్రూప్ ఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కీర్తి శ్రీనివాసరావును మెయిన్‌రోడ్డు శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం గ్రూప్ ఈవోగా నియమించారు. ఆఫీషియల్‌కాలనీ శ్రీ బుచ్చిరామలింగేశ్వర స్వామి ఆలయం ఈవో బి.శ్రీనివాస్‌ను ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ఈవోగా నియమించారు. అలాగే బి.వీ.ఎస్.ఎస్.ఎం.కృష్ణను అనకాపల్లి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ గ్రూపు ఈవోగా, కె.ఆదినారాయణను ఎల్‌బీకాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా, కె.పద్మావతిని ఆఫీషియల్ కాలనీ బుచ్చిరామలింగేశ్వర స్వామి ఆలయ ఈవోగా, టి.సాంబశివరావును నర్సీపట్నం గ్రూప్ ఆలయాల ఈవోగా నియమించారు. ఈవోలు తమకు కేటాయించిన స్థానాల్లో వెంటనే బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'పర్యాటకం'పై రేపు వ్యాసరచన పోటీలు

మహారాణిపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. 'టూరిజం అండ్ పీస్'అనే అంశంపై యువ టూరిజం క్లబ్ ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆ రోజు ఉదయం ఆరు గంటలకు హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమైన కూడళ్లలో విశాఖలోని అందమైన పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు 27న బహుమతులు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి(94949 18484), డీఈవో, ఆర్‌ఐవోలను సంప్రదించవచ్చు.

30న హాకీ, రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపిక

అగనంపూడి: ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా హాకీ జట్ల ఎంపిక కోసం ఈ నెల 30న పోటీలు నిర్వహిస్తున్నట్టు విశాఖ, అనకాపల్లి, ఏఎస్సార్ జిల్లాల కార్యదర్శులు తెలిపారు. నక్కపల్లి ఉన్నత పాఠశాలలో హాకీ పోటీలు జరుగుతాయి. అండర్ 14, 17 విభాగాల్లో బాల, బాలికలను ఎంపిక చేస్తారు. అదే రోజు పరవాడ మండలం సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహిస్తారు. విజేతలతో ఉమ్మడి విశాఖ జట్టును ఎంపిక చేస్తారు. ● అక్టోబర్ 1న పెద గుమ్మలూరులోని ఉన్నత పాఠశాలలో అండర్-17 బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపికైన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపించాలని కార్యదర్శులు సూచించారు.

'స్టీల్' మెల్ట్ షాప్-1లో ప్రమాదం

షిఫ్ట్ ఇన్‌చార్జికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో జరిగిన ప్రమాదంలో విభాగం సీనియర్ మేనేజర్ సీహెచ్ మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. విభాగంలోని ఎల్‌పీ బేలో స్టీల్ ట్రాన్స్‌ఫర్ కార్‌పై ఉన్న ల్యాడిల్‌లో ద్రవపు ఉక్కు ఉంది. కార్ కదులుతుండగా ల్యాడిల్‌లో పేలుడు సంభవించింది. దీంతో ల్యాడిల్‌లో ఉన్న ద్రవపు ఉక్కు పైభాగం ఒక్కసారిగా బయటకు విరజిమ్మింది. ఆ సమయంలో అక్కడ ఉన్న షిఫ్ట్ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు శరీరంపై ద్రవపు ఉక్కు పడడంతో ఒళ్లంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సహోద్యోగులు అతన్ని అంబులెన్స్‌లో ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని శరీరం 80 శాతం మించి కాలినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

అంతర్ రైల్వేస్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా అంతర్ రైల్వేస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. 14 జోనల్ రైల్వేలకు సంబంధించి 12 జట్లకు చెందిన 125 మంది మెన్, వుమెన్ బాక్సర్లు ఆయా వెయిట్ కేటగిరీల్లో తలపడుతున్నారు. మూడు రోజుల పాటు స్థానిక శ్రీనివాస కల్యాణ మండపం ప్రాంగణంలో ఈ పోటీలు ఈకోర్స్టావాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆతిథ్య ఈకోర్రైల్వే తరఫున వుమెన్ కేటగిరీలో ఎస్.ఉష, మౌనిక సోను, మెన్‌లో కె.శ్యాంకుమార్ పోటీపడుతున్నారు. కాగా.. మెన్‌లో ఆలీ కొమర్, వెంకటేషన్, మనోజ్‌కుమార్, తౌరవ్, జితేంద్ర, సాగరమాల, జయదేవ్, దివాకర్, సచిన్, సంజీత్‌లు ఆయా జోన్ జట్ల తరఫున పోటీపడుతున్నారు. వుమెన్‌లో సోనియా లథేర్, సోనియా చాహల్, మంజు, అనామిక, జ్యోతి, శశిచోప్రా, అల్ఫ్య, గీతిక, రోసీబేబి, సాన మచా ఆయా వెయిట్ కేటగిరీల్లో జోన్ జట్ల తరఫున సత్తాచాటనున్నారు. మెన్ కేటగిరీలో తొలి బౌట్‌ను లోకోమోటివ్ వర్క్స్, వెస్ట్రన్ రైల్వే బాక్సర్ల మధ్య జరిగిన పోటీని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. మహిళల విభాగంలో తొలిరోజు ఏడు వెయిట్ కేటగిరీల్లో 19బౌట్‌లు నిర్వహించారు. తొలి బౌట్‌ను 5-0తో లోకోమోటివ్ వర్క్స్ బాక్సర్ విజయం సాధించారు. ఎన్‌సీఆర్ 4-3తో ఎన్ఆర్‌పై విజయం సాధించగా అదే స్కోర్‌తో ఎన్‌డబ్ల్యూఆర్ జట్టుపై సదరన్ రైల్వే విజయం సాధించింది. సెంట్రల్ రైల్వే 5-0తో ఈస్ట్రన్‌రైల్వేపైన, మరో బౌట్‌లోనూ సెంట్రల్‌రైల్వే 5-2తో ఎస్‌సీఆర్ పై గెలుపొందింది.

జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్‌గా శివప్రసాద్‌రాజు

జీవీఎంసీ, పబ్లిక్ హెల్త్, టిడ్కో ఇంజినీర్ల బదిలీ



శివప్రసాద్‌రాజు

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్‌గా పి.శివప్రసాదరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఏపీ సీఆర్‌డీఏ ఎస్ఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. రవికృష్ణరాజు రిటైర్ అయిన తర్వాత ఇన్‌చార్జి సీఈగా వినయ్‌కుమార్ పనిచేస్తున్నారు. జీవీఎంసీ ఎస్ఈగా ఉన్న వినయ్‌కుమార్‌కు చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పిస్తూ విజయవాడలోని ఏపీయూఎఫ్ఐడీసీకు, మరో ఎస్ఈ కె.వేణుగోపాల్‌కి పదోన్నతి కల్పిస్తూ ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీర్‌గా డిప్యూటేషన్ కింద బదిలీ చేశారు. రాజమండ్రి పబ్లిక్ హెల్త్ సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ టి.సంపత్‌కుమార్, ఏపీ సీఆర్‌డీఏ ఎస్ఈ జీవీ పల్లంరాజును జీవీఎంసీ ఎస్ఈలుగా నియమించారు. జీవీఎంసీ ఎస్ఈ వై.కృష్ణారావును రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కి, ఈఈలు పి.స్వరాజ్యలక్ష్మిని రాజమండ్రి పీహెచ్ సర్కిల్‌కు, బీహెచ్ సంతోషికుమారిని శ్రీకాకుళం పీహెచ్ డివిజన్‌కు, ఎస్.మత్స్యరాజును కాకినాడ కార్పొరేషన్‌కి, జీవీ రమణమూర్తిని విజయనగరం ఏపీ టిడ్కోకి, పి.సుబ్బారావును విశాఖ పీహెచ్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌కి బదిలీ చేశారు. శ్రీకాకుళం పబ్లిక్ హెల్త్ డివిజన్ ఈఈ పి.సుగుణాకర్‌రావును విశాఖపట్నం పీహెచ్ డివిజన్‌కి, ఇక్కడ పనిచేస్తున్న రాయల్‌బాబును విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కి బదిలీ చేశా రు. విశాఖ పీహెచ్ క్యూసీ ఈఈ పి.కామేశ్వరరావును కాకినాడ కార్పొరేషన్‌కు, ఏపీ టిడ్కో నెల్లూరు ఈఈ ఎ.మహేష్‌ను విశాఖ ఏపీ టిడ్కో క్వాలిటీ కంట్రోల్ విభాగానికి, విజయనగరం కార్పొరేషన్ ఈఈ కె.శ్రీనివాసరావును పీహెచ్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్ ఈఈ పీవీ గంగాధర్‌రావు, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఈఈ డి.మురళీకృష్ణ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డి.శ్రీధర్, గుడివాడ మున్సిపాలిటీ ఈఈ బి.విజయ దుర్గ లను జీవీఎంసీ ఈఈలుగా నియమిస్తూ.. స్పెషల్ సీఎస్ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు పలువురు డీఈలను కూడా స్థానచలనం చేశారు.

నేడు ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మేధా సర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్ కోర్సు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, అప్రెంటిస్ షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 94401 97068 లో సంప్రదించాలన్నారు.

మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాలు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆదేశాల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈనెల 30లోగా దరఖాస్తులు పూర్తి చేసి సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వివరాలకు ప్రభుత్వ వెబ్ సైట్ https://cfw.ap.nic.inను సంప్రదించవచ్చు.

'జూడో'లో విశాఖ విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తాచాటినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు బాబు మంగళవారం తెలిపారు. అండర్ -14 బాలికల విభాగంలో బత్తిన పద్మ ప్రియాంక (జెడ్పీహెచ్ఎస్, పాయకరావుపేట) సిల్వర్ మెడల్ సాధించింది. సమ్మంగి భాగ్యశ్రీ (శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం కైవసం చేసుకుంది. అండర్-14 బాలుర విభాగంలో షేక్ సమీర్ ఖాన్(శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం, గోడ చరణి (జెడ్పీహెచ్ఎస్, వడ్డాది) సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని విశాఖ, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారులు చంద్రకళ, వెంకటలక్ష్మమ్మ అభినందించారు. టీమ్ కోచ్‌గా ఎల్.అప్పలరామ్, మేనేజర్‌గా ఎస్కే బీబీ వ్యవహరించారు.

ఆక్రమణల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కోరాడపేటలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తగరపువలస: భీమిలి జోన్ 2వ వార్డు సంగివలస డివిజన్‌లో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలపై దృష్టి సారించారు. 'దర్జాగా కబ్జా' శీర్షికతో ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు స్పందించారు. నమ్మివానిపేట చెరువు గర్భంలో ఆలయం పేరుతో చేపట్టిన నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించారు. దీనిని పూర్తిగా తొలగించాలని నమ్మివానిపేట వాసులు కోరుతున్నారు. కోరాడ పేట వద్ద సర్వే నంబర్ 39, 56, 57లలో 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారిలో శ్రీకృష్ణుడి ఆలయం పేరుతో చదును చేసిన ప్రభుత్వ భూమిలో హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశారు. రజక వలందపేటలో వినాయకుడి మండపం పేరుతో రహదారి మధ్యలోని కట్టడాన్ని తొలగించి రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.